# సాక్షి నంద్యాల

శనివారం । 27 । జనవరి । 2024






## అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన వై.సతీష్‌కుమార్ రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.



## వైభవంగా ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం ఊయలసేవను శాస్త్రోక్తపూజలతో నిర్వహించారు. అలాగే గ్రామదేవత అంకాలమ్మకు ప్రత్యేక అభిషేకాది కుంకుమార్చనలు చేపట్టారు.



## రూ. 43 లక్షల పట్టివేత

కృష్ణగిరి: అనంతపురానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి రూ.43.20లక్షలు ప్రైవేటు బస్సులో తరలిస్తుండగా అమకతాడు టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## న్యూస్‌రీల్

### మల్లన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి



మల్లన్న దర్శనానికి వెళ్తున్న న్యాయమూర్తి దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శుక్రవారం సాయంత్రం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఏపీ హైకోర్టు న్యాయమూర్తికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు మల్లికార్జున స్వామివారికి అభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

### 11 లక్షల మంది కులగణన పూర్తి

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో 11 లక్షల మంది కులగణన సర్వే పూర్తి చేసినట్లు డీఎల్‌డీఓ మురళీకల్యాణి శుక్రవారం తెలిపారు. జిల్లాలో 4,43,800 కుటుంబాలకు సంబంధించి 74.62 శాతం సర్వే పూర్తయ్యిందన్నారు. సకాలంలో సర్వే పనులు పూర్తయ్యేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

### రాష్ట్ర ఉత్తమ పంచాయతీగా ఇల్లూరు కొత్తపేట



సర్పంచ్ గోరంట్ల వెంకటరమణ

బనగానపల్లె: రాష్ట్రంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట గ్రామపంచాయతీ ఎంపిక కావడంతో సర్పంచ్ గోరంట్ల వెంకట రమణ అవార్డు అందుకున్నారు. శుక్రవారం ఢీల్లీలో రిపబ్లిక్ డే సందర్భంగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరీష్‌సింగ్ చేతుల మీదుగా సర్పంచ్ వెంకట రమణ మెమొంటో ప్రశంసా పత్రం అందుకున్నారు. గ్రామ పంచాయతీ ద్వారా గ్రామ ప్రజలకు అన్నిరకాల సౌకర్యాలు సేవలు అందించినందుకు గాను రాష్ట్ర ఉత్తమ పంచాయతీగా తమ గ్రామం ఎంపికైందని, స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పూర్తి సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని సర్పంచ్ తెలిపారు.

### కర్నూలు సర్కిల్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్‌ఈ ఉమాపతి

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూటరీ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్) కర్నూలు సర్కిల్ వివిధ అంశాల్లో ఉత్తమ పనితీరు కనబరచడంతో బెస్ట్ సర్కిల్ అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో సీఎండీ సంతోష్‌రావు చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి అందుకున్నారు. వరుసగా రెండో సారి ఈ అవార్డు లభించడం విశేషం. ఇటీవల సంభవించిన మిచాంగ్ తుపాను సమయంలో వాకాడు, నెల్లూరు, గూడూరు ప్రాంతాలకు వెళ్లి విశేషంగా సేవలు అందించినందుకు గుర్తింపుగా ఎస్‌ఈ ఉమాపతి ఇదే కార్యక్రమంలో మరో అవార్డు పొందారు.

### 1 నుంచి అందుబాటులోకి విజయవనం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని వెంగన్న బావి సమీపంలోని విజయవనం పుల్లయ్య పార్క్ ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుందని అటవీ శాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ పి. రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన డీఎఫ్‌వో పి. శివశంకర్‌రెడ్డితో కలిసి విజయవనం పుల్లయ్య పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 93 లక్షల వ్యయంతో 34 హెక్టార్లలో విజయవనాన్ని అభివృద్ధి చేశామన్నారు. డీఎఫ్‌ఓ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రధాన ద్వారం, పార్క్, చిల్డ్రన్స్ ప్లేగ్రౌండ్ పనులు పూర్తి అయ్యాయన్నారు. మరో రూ.40 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విజిటర్స్‌ను అనుమతిస్తామని, ప్రవేశ రుసుం పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 ఉంటుందన్నారు.

# సమగ్రాభివృద్ధికి కృషి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ



మొదటి బహుమతి సాధించిన విద్యాశాఖ శకటం



రెండవ బహుమతి సాధించిన పర్యాటక శాఖ శకటం



మూడవ బహుమతి సాధించిన వైద్యశాఖ శకటం

- విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- 50 ఎకరాల విస్తీర్ణంలో రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం
- రైతుల సంక్షేమానికి ప్రభుత్వ భరోసా
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్
- ఉత్తమ అధికారులకు అవార్డుల ప్రదానం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, అభివృద్ధి శకటాలు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన



గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ, వాహనంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడిన నూతన నంద్యాల జిల్లాలో సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం సాయుధ బలగాలు కవాతు నిర్వహించగా, మైదానంలో పరేడ్ పరిశీలన వాహనంపై నుంచి ఎస్పీ రఘువీర్ రెడ్డితో కలసి కలెక్టర్ పర్యటిస్తూ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలను వీక్షించడానికి నగరంలోని ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు వివరించారు.

### పేదలకు ఆరోగ్యసిరులు

పేద ప్రజలకు కార్పొరేట్ తరహాలో ఉచిత వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ 5 లక్షల నుంచి రూ. 25 లక్షలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచారు. క్యాన్సర్ వ్యాధికి ఎంత ఖర్చయిన ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్సను అందిస్తున్నాం. ఆరోగ్యశ్రీలో 3,225 వ్యాధులకు కార్పొరేట్ తరహా ఉచిత వైద్యాన్ని అందించడం జరుగుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు రూ.393 కోట్లు ఖర్చు చేసి 1.73 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించాం. జిల్లా అభివృద్ధిలో భాగంగా 50 ఎకరాల విస్తీర్ణంలో రూ. 475 కోట్లతో నూతన మెడికల్ కళాశాల ప్రారంభించడం, ప్రస్తుతం 150 మెడికల్ విద్యార్థులతో కళాశాల తరగతులు ప్రారంభమయ్యాయి. చిన్నచిన్న రోగాలకు పీహెచ్‌సీలకు వెళ్లాల్సిన పని లేకుండా వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ద్వారా ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తోంది. ప్రతి 2,500 కుటుంబాలకు ఒక క్లినిక్ ఏర్పాటు చేసి అందులో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాలు 12 రకాల వైద్యసేవలు అందించడంతో పాటు 90 రకాల మందులను అందుబాటులో ఉంచాం.

### రైతు సంక్షేమానికి పెద్దపీట

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టి ఏటా ప్రతి రైతు కుటుంబానికి రూ.13,500 పెట్టుబడి సాయం అందిస్తోంది. ఈ పథకం కింద అయిదేళ్లలో రూ.67,500 లబ్ధిని రైతులు పొందడం జరిగింది. 2023–24 సంవత్సరంలో 2.33 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.218 కోట్లను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. 2022–23లో సున్నా వడ్డీ పంట రుణాల కింద లబ్ధి పొంది సకాలంలో రుణాలు చెల్లించిన 44,590 మంది రైతులకు రూ.10.63 కోట్ల వడ్డీని మాఫీ అయ్యింది. ఈ రబీలో పంట రుణాల కింద 87,770 మంది రైతులకు రూ.1457 కోట్లు పంట రుణాలను బ్యాంకుల ద్వారా అందించాం.

### అభివృద్ధి పరుగులు



మాట్లాడుతున్న కలెక్టర్

పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ .166 కోట్ల అంచనాతో చేపట్టిన 415 గ్రామ సచివాలయ భవనాలలో 292 పూర్తయ్యాయి. రూ.86 కోట్ల అంచనాతో చేపట్టిన 394 రైతు భరోసా కేంద్రాల్లో 222 పూర్తి కాగా, రూ.48 కోట్ల అంచనాతో చేపట్టిన 272 వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్స్‌లలో 116 పూర్తయ్యాయి. మిగిలినవన్నీ వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయి. రూ.27 కోట్ల అంచనాతో చేపట్టిన 168 వైఎస్ఆర్ డిజిటల్ గ్రంథాలయ కేంద్ర భవన నిర్మాణాలు వివిధ దశలలో ప్రగతిలో ఉన్నాయి. రూ. 18 కోట్ల అంచనాతో చేపట్టిన 1,020 పాల సేకరణ, శీతలీకరణ కేంద్రాల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా జిల్లాలో రూ.913 కోట్లతో 800 కి.మీల 150 రహదారుల నిర్మాణాలు పూర్తి చేశాం. పట్టణంలోని బొమ్మలసత్రం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి నూనెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు 2.5 కి.మీల రోడ్డును 4 లైన్ల రోడ్డుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం 13 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. రోడ్డుకిరువైపుల డ్రైనేజీ కాలువలు, రహదారి విస్తరణ పనులు వేగంగా జరుపుతున్నాం.

### పెన్షన్ కానుక రూ. 3వేలు..

వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా ఉండాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ కానుక పింఛన్లను ప్రతి నెల 1వ తేదీనే అందజేస్తున్నాం. వృద్ధులతో పాటు వితంతువు, ఒంటరి మహిళ, చేనేత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, ఈఆర్‌టీ పెన్షన్ దారులకు నెలకు రూ.3 వేలు చొప్పున ఈ ఏడాది నుంచి అందజేయడం జరిగింది. జనవరి మాసంలో 2.19 లక్షల మంది పింఛన్‌దారులకు దాదాపు రూ.66.64కోట్ల పింఛన్లను గ్రామ, వార్డు వాలంటీర్ల ద్వారా పంపిణీ చేయిస్తున్నాం.

### మహిళా ఆర్థిక స్వావలంబనే ధ్యేయం..

మహిళలకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో అర్హులైన వారికి ఇప్పటి వరకు రూ.75 వేలు ఆర్థిక సహాయం అందించి జీవనోపాధి మార్గాలను కల్పించాం. జిల్లాలో అర్హులైన 1.46 లక్షల మందికి రూ.272 కోట్ల మహిళల ఖాతాలకు జమ చేశాం. వైఎస్సార్ ఆసరా కింద జిల్లాలో 77,742 మందికి రూ.501 కోట్లను మహిళల ఖాతాలకు జమ చేశాం. అంతేకాక డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి- మెప్మాల ద్వారా స్వయం సహాయక మహిళలకు ఆర్థిక చేయూత నిచ్చేందుకు బ్యాంక్ లింకేజీ కింద 16,572 సంఘాలకు రూ.1197 కోట్లు పంపిణీ చేశాం.

### పేదలందరికీ ఇళ్లు ..

పేదల కనీస అవసరాలలో భాగంగా 'నవరత్నాలలో–పేదలందరికీ ఇళ్ల అనే పథకం ద్వారా మన జిల్లాలో 321 జగనన్న లేఅవుట్‌లలో 46,922 గృహాలను మంజూరు చేశాం. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందజేశాం. ఇప్పటి వరకు 45,905 గృహాల నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది. 53 జగనన్న హౌసింగ్ కాలనీల్లో నీటి సరఫరా రహదారులకు రూ.4.39 కోట్లు ఖర్చు చేశాం.

### ఊరూరా సేవాలయాలు..

ప్రతి గ్రామంలో స్థానికంగా ఉన్న 10 మంది యువతకి గ్రామ సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాం. జిల్లాలో 409 గ్రామ సచివాలయాలు, 107 వార్డు సచివాలయాలలో 5,580 మంది ఫంక్షనల్ కార్యదర్శులు పని చేస్తున్నారు. సచివాలయాలలో పని చేస్తున్న 5,580 మంది ఉద్యోగులలో అర్హత పొందిన 4,126 మందికి ప్రొబేషన్ డిక్లేర్ చేశాం.

### సాగునీటి వనరులు సద్వినియోగం

జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితిలు ఆందోళన కలిగించినప్పటికీ రిజర్వాయర్లలో ఉన్న నీటి లభ్యతను బట్టి సాగునీటి కాలం ద్వారా షెడ్యూల్ ప్రకారం నీటిని అందించాం. గత ఖరీఫ్‌లో కాలువల ద్వారా 5,12,104 ఎకరాలకు సాగునీటిని క్యాలెండర్ షెడ్యూల్ ప్రకారం విడుదల చేశాం. ఈ రబీలో కేసీ కెనాల్ కింద 97,700 ఎకరాలకు, ఎస్ఆర్‌బీసీ కాలువల ద్వారా 1,12,265 ఎకరాలకు, తెలుగు గంగ పథకం కింద 83,800 ఎకరాలకు, సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 8వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నాం. అవుకు సొరంగం–2లో ఫాల్టుజోన్ పనులు పూర్తి చేసి 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశాం. రూ.1758 కోట్లతో గాలేరు నగరి సామర్థ్యాన్ని 11వేల క్యూసెక్కుల నుంచి 35వేల క్యూసెక్కుల వరకు పెంచేందుకు చేపడుతున్న పనులు శరవేగంగా సాగుతున్నాయి.

### విద్యా వ్యవస్థలో సమూల మార్పులు..

నాణ్యమైన ఉచిత విద్యను అందించడంలో భాగంగా 'మన బడి నాడు–నేడు' కార్యక్రమం ద్వారా జిల్లాలో మొదటి దశలో 486 ప్రభుత్వ పాఠశాలలను అత్యంత సుందరంగా ఆధునీకరించి వాటికి కావలసిన సదుపాయాలను కల్పించడం జరిగింది. ప్రస్తుతం రెండవ దశలో రూ.366 కోట్ల ఖర్చుతో 983 ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునీకరణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. జగనన్న అమ్మ ఒడి పథకం కింద 2022–23 విద్యా సంవత్సరానికి ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున జిల్లాలో అర్హత కలిగిన 1,67,084 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.218 కోట్ల జమ చేశాం. వరుసగా నాలుగో ఏడాది 2023–24 విద్యా సంవత్సరానికి 1,369 పాఠశాలల్లోని 1.62 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి జగనన్న విద్యా కానుక అందజేశాం. 2019 సంవత్సరం నుండి ఇప్పటివరకు 'జగనన్న విద్యా దీవెన' కింద జిల్లాలో 2,36,795 మంది విద్యార్థులకు రూ.157 కోట్ల, వసతిదీవెన కింద 77,938 మంది విద్యార్థులకు రూ.44.17 కోట్లు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలలో జమ చేశాం.

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగాస్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులను కలెక్టర్, ఎమ్మెల్యేలు సన్మానించారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన జాతీయ సమైక్యత, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించారు. అలాగే వివిధ శాఖల ప్రగతిపై ప్రదర్శించిన శకటాలు ఆకట్టుకున్నాయి. ఇందులో విద్యాశాఖ శకటానికి ప్రథమ బహుమతి, పర్యాటక శాఖ శకటానికి రెండవ బహుమతి, వైద్యశాఖ శకటానికి మూడో బహుమతిగా ఎంపికయ్యాయి. కన్సోలేషన్ బహుమతులుగా స్త్రీ శిశుసంక్షేమ శాఖ, ఉద్యానవన శాఖ శకటాలకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, తొగురు ఆర్థర్, మార్క్ ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, బెస్త సంక్షేమ సంఘ డైరెక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఏఎస్పీ వెంకట రాముడు, డీఆర్‌ఓ పుల్లయ్య, పట్టణానికి చెందిన ప్రముఖులు, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు



హాజరైన ఎమ్మెల్యేలు శిల్పా రవి, చక్రపాణిరెడ్డి, ఆర్థర్ తదితరులు



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు



ఆకట్టుకున్న బోడెమ్మనూరు జెడ్పీవిద్యార్థుల ప్రదర్శన

# రైతులకు ఇబ్బంది కలిగించొద్దు



జొన్నలను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

గోస్పాడు: జొన్నల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎం.కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పైర్లను ఈ–పంట నమోదుతో పాటు కేవైసీ తప్పనిసరిగా చేయాలన్నారు. ప్రభుత్వం రైతులు పండించిన జొన్నను గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేలా ఏర్పాటు చేశామన్నారు. ఎఫ్ఏక్యూ నాణ్యతలకు లోబడి పంటను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. జొన్నకు మద్దతు ధర క్వింటాకు రూ.3,180 నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు మద్దతు ధరకు విక్రయించాలనుకుంటే స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గోనెసంచులు, రవాణా చార్జీలు పౌరసరఫరా శాఖా వారు సరఫరా చేయనున్నారన్నారు. జేసీ వెంట డీఏఓ మోహన్ రావు, సివిల్ సప్లయ్ మేనేజర్ రాజునాయక్, ఏడీ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ విజయశేఖర్, డీటీ రామచంద్రరావు, గ్రామ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# నెరవేరనున్న దశాబ్దాల కల

- నేడు ఫోర్ కోర్ట్స్‌కు భూమిపూజ
- హాజరు కానున్న ముగ్గురు హైకోర్టు జడ్జిలు



ఫోర్ కోర్ట్స్ భవనం నమూనా

డోన్: నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల సాకారమవుతోంది. గత టీడీపీ ప్రభుత్వం చేయలేని పనులను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే చేసి చూపిస్తోంది. డోన్‌కు రెవెన్యూ సబ్‌డివిజన్‌తో పాటు సబ్‌కోర్టును కూడా మంజూరు చేసింది. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రాష్ట్ర ప్రభుత్వం డోన్‌కు ఫోర్ కోర్ట్స్ కాంప్లెక్స్ భవనాల నిర్మాణం కోసం రూ.23.5 కోట్లు మంజూరు చేసింది. స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలోని రెండెకరాల విస్తీర్ణంలో అత్యద్భుతంగా ఫోర్ కోర్ట్స్ నిర్మాణానికి శనివారం భూమిపూజ చేయనున్నారు. రాష్ట్ర హైకోర్టు జడ్జిలు సురేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, హరినాథ్ నూనేపల్లి ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి శ్రీనివాసరావు హాజరుకానున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షులు రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం డోన్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్, అడిషనల్ సివిల్, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులతో పాటు అసిస్టెంట్ సెషన్స్ కోర్టులను బహుళ అంతస్తులుగా నిర్మించనున్నారు. గత 20 ఏళ్లుగా డోన్‌కు సబ్‌కోర్టు మంజూరు చేయాలని న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఇక్కడి నుంచి అసెంబ్లీకి ఎన్నికైన వారు ముఖ్యమంత్రులుగా, ఉప ముఖ్యమంత్రులుగా పదవి బాధ్యతలు చేపట్టినా కూడా న్యాయవాదుల ఆకాంక్షను నెరవేర్చలేకపోయారు. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి రావడంతో న్యాయవాదుల పోరాటం ఫలించి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో డోన్‌కు సబ్‌కోర్టు మంజూరు కావడమే కాక, ఫోర్ కోర్ట్స్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

## క్లుప్తంగా

### 31న తలనీలాల వేలంపాట

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో ఈ నెల 31వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు తలనీలాల వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఏడాది పాటు తలనీలాలు పోగుచేసుకునే హక్కుల కోసం వేలంపాట నిర్వహిస్తామని పాటదారులు లక్ష రూపాయలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

### స్నేహితురాలి చికిత్సకు ఆర్థిక సాయం



వరలక్ష్మికి నగదు అందజేస్తున్న స్నేహితులు

తుగ్గలి: 'ఆపదలో అవసరాన్ని.. బాధల్లో మనసును తెలుసుకొని సహాయపడే వాళ్లే నిజమైన స్నేహితులు' ఈ మాటలు కొందరు మిత్రులు అక్షర సత్యం చేశారు. 1996–2001 మధ్యలో జొన్నగిరి జెడ్పీహెచ్ఎస్‌లో కలిసి మెలిసి చదువుకున్నారు. వారిలో పీ.కొత్తూరుకు చెందిన వరలక్ష్మి కిడ్నీ వ్యాధికి గురై వైద్యం పొందుతోంది. విషయం నాడు చదువుకున్న మిత్రులకు తెలిసింది. వెంటనే స్పందించి తమ వంతుగా రూ.25 వేలు పోగుచేసి శుక్రవారం మిత్రురాలికి అందజేశారు. దేవుడి దయతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### సాంకేతికత అందిపుచ్చుకోవాలి

చిప్పగిరి: వ్యవసాయ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఏఓ విజయలక్ష్మి రైతులకు సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని ఏరూరు గ్రామంలో వ్యవసాయ డ్రోన్ ప్రదర్శన నిర్వహించారు. డ్రోన్ పనితీరుపై రైతులకు అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికనుగుణంగా వ్యవసాయంలో సాంకేతికను వినియోగించుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

### మహిళ అనుమానాస్పద మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని బావిలో శుక్రవారం అనుమానస్పద స్థితిలో మహిళ మృతదేహం బయటపడింది. వివరాలు.. పట్టణంలోని పెద్దకమేలా ప్రాంతంలో వడ్డె శివకృష్ణ, పద్మావతి దంపతులు నివాసముంటున్నారు. ఉదయం పద్మావతి (31) ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇళ్లలో విచారించగా ఆచూకీ తెలియలేదు. సాయంత్రం సిరాలదొడ్డి సబ్‌స్టేషన్ సమీపంలోని వ్యవసాయ బావిలో మృతదేహాన్ని గమనించిన రైతులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమె భర్త శివకృష్ణ రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ శరత్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి బావి నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆమె మృతికి కారణాలు తెలియలేదని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# సేవలకు ప్రశంస

రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు శుక్రవారం నంద్యాల పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి ప్రశంసా పత్రాలను అందజేశారు. – సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న డీఆర్ఓ పుల్లయ్య



శ్రీనివాసులు, ఆర్డీఓ, నంద్యాల · సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల · శ్రీనివాసులు, ఆర్టీసీ ఆర్ఎం · జఫ్రుల్లా, డీసీహెచ్ఎస్, నంద్యాల · నాగరాజు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి



సుబ్బారెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ, నంద్యాల · శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ · మనోహర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, నంద్యాల



శ్రీధర్‌రెడ్డి, · మణికంఠ, · నరసింహారెడ్డి · మునిప్రసాద్ · పెద్దన్న, దఫేదార్, నంద్యాల



శాంతకుమారి, విలేజ్ సర్వేయర్ జేసీ పేషీ, నంద్యాల · కేవీ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏఓ, నంద్యాల · సుధాకర్‌రావు, కలెక్టరేట్ తహసీల్దార్



యూసుఫ్‌నాయక్, కలెక్టరేట్ డీటీ, నంద్యాల · రామసంజీవరావు, కలెక్టరేట్ డీటీ, నంద్యాల · మధుసూదన్, ఎన్నికల డీటీ, నంద్యాల · హేమంత్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్, నంద్యాల · మాధవి



రాజేష్, కంప్యూటర్ ఆపరేటర్, నంద్యాల · అనూష నంద్యాల · నాగరాజు నంద్యాల



నారాయణ, వీఆర్ఏ, నంద్యాల · శ్రీనివాసులు, తహసీల్దార్, నంద్యాల · చంద్రశేఖర్, ఎన్నికల డీటీ, నంద్యాల · శేకరప్ప, ఆర్ఐ, ఆళ్లగడ్డ · యాసిన్, · మహేశ్వరరెడ్డి · యుగంధర్‌రెడ్డి, ఆర్ఐ, నంద్యాల · రాము, సీనియర్ అసిస్టెంట్, గోస్పాడు · సురేష్, జూనియర్ అసిస్టెంట్ ఆర్డీఓ ఆఫీసు · అబ్దుల్‌ఖాదర్, ఆర్డీఓ డ్రైవర్, నంద్యాల · చంద్రశేఖర్ · చంద్ర · నాగేంద్రబాబు, · హరికృష్ణ · విమల



చంద్రశేఖర్‌వర్మ, తహసీల్దార్, · మధుసూదన్ రావు, · మధు · జి.వెంకటరాముడు, అడిషనల్ ఎస్పీ, నంద్యాల · చంద్రబాబు, అడిషనల్‌ఎస్పీ ఏఆర్, నంద్యాల · జేవీ సంతోష్, డీఎస్పీ స్పెషల్ బ్రాంచ్, నంద్యాల · మహేశ్వరరెడ్డి, డీఎస్పీ, నంద్యాల · వెంకటరామయ్య, డీఎస్పీ, ఆళ్లగడ్డ · శ్రీనివాసరావు యాదవ్, డీఎస్పీ, ఆత్మకూరు · రామాంజినాయక్, ఎస్సీ, ఎస్టీ డీఎస్పీ నంద్యాల · మారుతిరావు, దిశ డీఎస్పీ, నంద్యాల · బి.రంగముని, డీఎస్పీ ఏఆర్ నంద్యాల · చంద్రబాబు నాయుడు, సీఐ, నంద్యాల · సూర్యమౌళి, దిశ సీఐ, నంద్యాల · ప్రీతమ్‌రెడ్డి, సీఐ బేతంచెర్ల



నరసింహులు, త్రీటౌన్ సీఐ నంద్యాల · రామ్మోహన్‌రెడ్డి, తాలూకా ఎస్ఐ, నంద్యాల · వెంకటేశ్వరరావు, సీఐ, పాణ్యం · అశోక్, ఎస్ఐ, పాణ్యం · నరసింహులు, తాలూకా ఎస్ఐ, ఆళ్లగడ్డ · ప్రవీన్‌కుమార్, తాలూకా సీఐ, డోన్ · సునిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, నంద్యాల · జి.వెంకటసుబ్బయ్య, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్, · టి. వి.రెడ్డి, పంచాయతీరాజ్ డీఈఈ, ఆత్మకూరు · షాదిక్‌అలీ, ఎస్ఐ, నంద్యాల · సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ డోన్ · సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ, ప్యాపిలి · విజయ్‌కుమార్, ఎస్ఐ జలదుర్గం · వీరన్న, ఆర్ఎస్ఐ, నంద్యాల · హర్షవర్ధన్‌రెడ్డి, ఆర్ఎస్ఐ, నంద్యాల



సి.రామిరెడ్డి, ఏఆర్ఎస్ఐ, నంద్యాల · రాజు, ఏఆర్ కానిస్టేబుల్, నంద్యాల · రాజేష్,ఏఆర్ కానిస్టేబుల్, నంద్యాల · సరస్వతి, లైజనింగ్ ఆఫీసర్, నంద్యాల · రమిజాబీ, ఈడీ కానిస్టేబుల్, డోన్ · ఫరూక్, ఈడీ కానిస్టేబుల్, నంద్యాల · జయచంద్ర, ఈడీ కానిస్టేబుల్, నంద్యాల · ప్రసాదరావు, సీఎస్‌డీటీ, నంద్యాల · చంద్రమోహన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ · గౌస్‌పీర్, సీనియర్ అసిస్టెంట్ · రంగబాబు, హోంగార్డు, నంద్యాల · సంధ్యారాణి, ఇన్‌చార్జిప్రిన్సిపాల్ · మధుసూదన్, డీఈ ఆర్‌డబ్ల్యూఎస్, · మేరీ, ఎంపీడీఓ, కొత్తపల్లి · శ్రీనివాసులు, ఎంపీడీఓ, డోన్



అమానుల్లా, ఎంపీడీఓ, వెలుగోడు · శివరామయ్య, ఎంపీడీఓ, బనగానపల్లె · దస్తగిరి, ఎంపీడీఓ, పాణ్యం · వెంకటప్రసాదరెడ్డి, ఏఓ కొలిమిగుండ్ల, · అమరావతి, జూనియర్ అసిస్టెంట్, బేతంచెర్ల · ఆంథోనిరాజు, డిప్యూటీ ఈఈ, నంద్యాల · ప్రసాదరెడ్డి, ఏఈ, బండిఆత్మకూరు · డాక్టర్ అనురాధ, సివిల్‌సర్జన్, డోన్ · డాక్టర్ ఓ.లలిత, బనగానపల్లె · సుజాత, సివిల్ అసిస్టెంట్, ఆళ్లగడ్డ · ఖాదర్‌బాషా, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్, జీఎస్‌డబ్ల్యూఎస్, · కె.సరళకుమారి, అనలిస్ట్ గ్రౌండ్ వాటర్, నంద్యాల · మురళీ మద్దిలేటి, · వెంకటదాసు, అసిస్టెంట్ కమిషనర్, నంద్యాల · నరసింహమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్, నంద్యాల



సుబ్బరాయుడు, కమిషనర్ దఫేదర్, నంద్యాల · వెంకటేశ్వరరెడ్డి, · భాస్కర్, ఫార్మాసిస్ట్, నంద్యాల · రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, ఆళ్లగడ్డ · రుక్సానఖాతున్, జూనియర్ అసిస్టెంట్, పాణ్యం · యాగంటేశ్వరప్ప, ప్రముఖ వ్యాఖ్యాత, నంద్యాల · రవి, స్పెషల్ బ్రాంచ్,నంద్యాల · సందీప్, డీపీఆర్ఓ టైపిస్ట్, నంద్యాల · కేఎన్ సుజాత, టౌన్ మిషన్ కో ఆర్డినేటర్, డోన్ · వెంకటేశ్వర్లు, హౌసింగ్ డీఈఈ, నంద్యాల · సికిందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్, నంద్యాల · కృష్ణవేణమ్మ, ఈఓఆర్‌డీ, · లక్ష్మీనారాయణ, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్, నంద్యాల · ఆనంద్‌కుమార్, మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్, నంద్యాల



కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి చేతుల మీదుగా మెడల్స్ అందుకుంటున్న ఏఎస్ఐ బాలచంద్రుడు



రామిరెడ్డి ఏఆర్ఎస్ఐ



రంగముని, ఏఆర్ డీఎస్పీ, నంద్యాల



వెంకటేశ్వర్లు, ఏఆర్ఎస్ఐ



కరీముల్లాబేగ్, ఏఎస్ఐ

## కలెక్టర్ తేనీటి విందు

కర్నూలు (సెంట్రల్) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఎట్ హోమ్ కార్యక్రమాన్ని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, పాణ్యం, ఆదోని, మంత్రాలయం, కర్నూలు శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, సాయిప్రసాద రెడ్డి, బాలనాగిరెడ్డి, హఫీజ్ ఖాన్‌తో పాటు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ, అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, డీఆర్వో మధుసూదన్‌రావు హాజరయ్యారు. గణతంత్ర దినోత్సవం రోజున జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులకు కలెక్టర్ ఎట్ హోమ్ కార్యక్రమంలో తేనీటి విందు ఇవ్వడం పరిపాటి. ఈ కార్యక్రమం ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. కళాకారుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. అధికారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు కూడా రావడంతో కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. వచ్చిన వారు కలెక్టర్ ఇచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించారు.





తేనీటి విందులో కలెక్టర్ సృజన, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల, ఎమ్మెల్యేలు కాటసాని, బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి



### ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఆదోనిఅర్బన్: పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్(45) చెట్టుకు ఉరేసుకొని శుక్రవారం మృతిచెందారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రశేఖర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ఆరోగ్యం బాగాలేకపోవడం, ఆర్థిక సమస్యలు ఉండటంతో మనస్తాపానికి గురై స్థానిక టూరిస్టు హోటల్ సమీపంలో ఎవరూ లేని సమయంలో చెట్టుకు ఉరేసుకొని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

### మరోసారి కుంగిన గోరుకల్లు కట్ట

పాణ్యం: గోరుకల్లు జలాశయ కట్ట రెండో సారి కుంగింది. బండ్ వద్ద ఉన్న ఓటీ రెగ్యూలేటర్ అనుకొని బండ్ పిచ్చింగ్ దాదాపుగా రెండు అడుగుల మేర కుంగిపోయింది. విషయం తెలుసుకున్న అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. కుంగిన బండ్‌తో డ్యామ్‌కు ఎలాంటి ప్రమాదం లేదని ఈఈ సుభకుమార్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 3 టీఎంసీల వరకు నీరు ఉన్నట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల రాగానే పనులు చేపట్టనున్నారు.

# దైవ దర్శనానికి వెళ్తూ..

- పిరిడీ సమీపంలో రోడ్డు ప్రమాదం
- స్కార్పియోను ఢీకొన్న లారీ
- డోన్‌కు చెందిన యువకుడి మృతి
- అదే ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఇద్దరు దుర్మరణం



ప్రమాదానికి గురైన వ్యక్తి



మృతుడు ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

డోన్ టౌన్: మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన షిరిడీ సాయిబాబను దర్శించుకునేందుకు బంధువులతో కలసి వెళ్లిన ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. శుక్రవారం మహారాష్ట్రలోని గైగాన్ ప్రాంతంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో డోన్‌కు చెందిన యువకుడితో పాటు తెలంగాణ రాష్ట్రం కొత్తకోటకు చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. మృతుల కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. డోన్‌కు చెందిన కూరగయాల వెంకట్రాముడు తన భార్య రోజా, కుమారుడు ప్రవీణ్‌కుమార్(20), వెంకట్రాముని తమ్ముని కుమారుడు నవదీప్‌తో కలిసి తెలంగాణ రాష్ట్రం కొత్తకోటకు చెందిన వారి బంధువులు నలుగురు కలిసి స్కార్పియో వాహనంలో షిరిడీ బయలుదేరారు. క్షేత్రానికి మరి కొద్ది గంటల్లో సమీపిస్తుండగా గైగాన్ ప్రాంతంతో ప్రమాదవశాత్తు వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ కుమార్‌తో పాటు కొత్తకోటకు చెందిన ఇద్దరు మొత్తం (తల్లీ, కుమారుడు) మృతి చెందారు. గాయపడిన వెంకట్రాముడు, రోజా, నవదీప్‌ను స్థానికులు అక్కడికి సమీపంలోని వైజాపూర్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

# ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు

కర్నూలు : జిల్లా ఎక్సైజ్ శాఖలో భారీగా అధికారుల బదిలీలు జరిగాయి. ఏపీబీసీఎల్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న మునుస్వామి విజయవాడకు, కర్నూలు ఐఎంఎల్ డిపో మేనేజర్ నాగేశ్వరరావు పల్నాడుకు, అసిస్టెంట్ మేనేజర్ రాముడు తిరుపతికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజిత్ భార్గవ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సెబ్‌లో ఏఈఎస్‌గా పనిచేస్తున్న సుధీర్ బాబుకు పదోన్నతి కల్పించి కర్నూలు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నంద్యాల ఏపీబీసీఎల్‌లో ఏఈఎస్‌గా పని చేస్తున్న మణికంఠకు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పించి అక్కడే నియమించారు.

**సీఐలు, ఎస్ఐలు కూడా బదిలీ...**

కర్నూలు డిప్యూటీ కమిషనర్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లో ఉన్న సీఐ కృష్ణమూర్తి, అనంతపురం ఏసీ విజిలెన్స్‌కు బదిలీ అయ్యారు. కర్నూలు ఐఎంఎల్ డిపో సీఐలు వెంకటేశ్వర్లు, గౌరిప్రియ సత్యసాయి జిల్లా ఐఎంఎల్ డిపోకు, పద్మావతి డిస్టిలరీ వింగ్‌కు బదిలీ అయ్యారు. నంద్యాల ఐఎంఎల్ డిపో సీఐ కృష్ణకుమార్ కడప ఆర్‌ఓఎంఓకు, చిత్తూరు ఏసీ విజిలెన్స్‌లో పనిచేస్తున్న సీఐ వీరారెడ్డి నంద్యాల ఐఎంఎల్ డిపోకు, అనంతపురం ఐఎంఎల్ డిపోలో ఉన్న సీఐ కృష్ణమూర్తి కర్నూలు ఐఎంఎల్ డిపోకు నియమితులయ్యారు. సత్యసాయి జిల్లా సీఐ నర్సింహులును కర్నూలు డీసీ స్క్వాడ్‌కు, కడప ఐఎంఎల్ డిపో సీఐ చంద్రహాస్ కర్నూలు ఐఎంఎల్ డిపోకు, కుప్పంలో ఉన్న సీఐ ఇంద్రను కర్నూలుకు, నంద్యాల ఎస్‌పీవై రెడ్డి ఆగ్రోస్‌లో పనిచేస్తున్న సీఐ శిరీషా దేవి తిరుపతికి బదిలీ అయ్యారు. అలాగే రాయలసీమ జోన్ పరిధిలో 48 మంది ఎస్ఐలకు స్థానచలనం కలుగగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 9 మంది ఎస్ఐలు పొరుగు జిల్లాకు బదిలీ కాగా, కర్నూలు జిల్లాకు కొత్తగా 8 మంది ఎస్ఐలను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

### 28, 29 తేదీల్లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కర్నూలు: వడ్డెమాను ఏబీఎం చర్చి ప్రారంభోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెంకటరమణ, ప్రకాశం, యువరాజు, సంజీవరాజు, విజయుడు సంయుక్తంగా శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వడ్డెమాను, కోనేటమ్మపల్లెలో ఈనెల 28, 29 తేదీలలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి తమ జట్టు పేరు నమోదు చేసుకోవాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20 వేలు, రెండోబహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

### రూ. 6 లక్షలు పట్టివేత

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రి టోల్ ప్లాజా సమీపంలోని పోలీసు చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో రూ. 6 లక్షలు పట్టుబడ్డాయి. నంద్యాల పట్టణం హనీఫ్ నగర్‌కు చెందిన సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి అతని సొంత వాహనంలో రూ.6.00 లక్షల నగదును తరలిస్తుండగా చాగలమర్రి పోలీసులు పట్టుకున్నారు. నగదుకు సంబంధించి సరైన ఆధారాలు లేక పోవడంతో నగదును సీజ్ చేసి ఐటీ శాఖకు అప్పగించినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

### రూ.4.50 లక్షలు నగదు, వెండి స్వాధీనం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని పాత బస్టాండు కూడలిలోని మీర్‌మహ్మద్ షాఖాద్రి దర్గా వద్ద ఎటువంటి రశీదులు లేకుండా రూ.4.50 లక్షలు నగదు, 3,028.5 గ్రాముల వెండి ఆభరణాలు శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోసిగి మండలం దొడ్డిబెళగల్ గ్రామానికి చెందిన కటికె మహ్మద్ ఇస్మాయిల్ ఎటువంటి రశీదులు, ఆధారాలు లేకుండా వీటిఇన తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ తేజమూర్తి తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ లక్ష్మీనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.